

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు


మండలంలోని పేరుపాలెం బీచ్‌లో ఆదివారం పర్యాటకులతో సందడి నెలకొంది. పర్యాటకు లు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక ద్విచక్ర వాహనాలపై బీచ్‌కు ఉదయమే చేరుకున్నారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తిన్నెలపై ఆటలాడు కున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సేదతీరారు.



బీచ్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల రామానాయుడు, జెసి, ఎస్‌పి



ఏలూరు జెసి లావణ్యవేణితో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ప్రజాశక్తి - పోలవరం

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టును సందర్శించనున్నట్లు నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతతోపాటు అవసరమైన ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి అంశాలవారీగా సంబంధిత అధికారులతో ఆదివారం ప్రాజెక్టు డ్యామ్ వద్ద సమావేశ మందిరంలో జెసి ఆధ్వర్యాన సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలిగా ఏలూరు జిల్లాకు విచ్చేస్తున్న సిఎం పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేసి, సమన్వయంతో పని చేయాలని సూచించారు. 17వ తేదీ ఉదయం పది గంటలకు సిఎం చంద్రబాబు పోలవరం డ్యామ్ సైట్లోని హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటున్నారన్నారు. ప్రజాప్రతినిధులను కలుసుకున్న అనంతరం వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టు పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం పోలవరం డ్యామ్ సైట్ ప్రాంతంలో వివిధ పనుల ప్రగతిని పరిశీలిస్తారన్నారు. స్పిల్ వే, గైడ్‌బండ్, గ్యాప్-1, 2, 3, అప్పర్ స్ట్రీమ్ కాపర్ డ్యామ్, డౌన్ స్ట్రీమ్ కాపర్ డ్యామ్, పవర్ హౌస్‌ను పరిశీలిస్తారని వివరించారు. పరిశీలిస్తారు. సిఎం పనులను పరిశీలించే ప్రాంతాల్లో పూర్తి వివరాలను అందజేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. తొలుత ఎస్‌పి మేరీ ప్రశాంతితో కలిసి సిఎం పర్యటించే ప్రాంతాలను, అక్కడ ఏర్పాట్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ ఎం.సూర్యతేజ, పోలవరం ప్రాజెక్టు ఎస్‌ఇ నరసింహమూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిఎం పర్యటనా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నిమ్మల

సిఎం చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు పనులను పరిశీలించనున్న దృష్ట్యా పర్యటనా ఏర్పాట్లను రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆదివాకం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రాజెక్టు పనుల్లో ప్రతి అంశంలో వాటి నిర్మాణ ప్రగతిని ఆయా ప్రాంతాలకు వెళ్లి పరిశీలిస్తారని, ఆయా ప్రాంతాలలో ఇంజనీరింగ్ సిబ్బంది పనుల ప్రగతిని ముఖ్యమంత్రికి తెలియజేయాలని అన్నారు. సిఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణిని ఆదేశించారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్‌పి డి.మేరీప్రశాంతిని ఆదేశించారు.



అధికారులకు ఆదేశాలిస్తున్న ఎస్‌పి మేరీ ప్రశాంతి, జెసి లావణ్యవేణి

నేడు చంద్రబాబు పర్యటన సాగేదిలా

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించనున్నారు. ఉదయం పది గంటలకు ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకుంటారు. ముందుగా అధికారులు, రాజకీయ నాయకులతో మాట్లాడనున్నారు. 10.10 గంటలకు వ్యూ పాయింట్ నుంచి ప్రాజెక్టును పరిశీలిస్తారు. అనంతరం స్పిల్‌వే గైడ్‌బండ్, కాపర్ డ్యామ్ గ్యాప్‌లు, పవర్‌హౌస్ ప్రాజెక్టు పనులన్నింటినీ స్వయంగా పరిశీలిస్తారు. అనంతరం కొండపై ఉన్న గెస్ట్‌హౌస్‌కు చేరుకుని 2 గంటలకు మధ్యాహ్న భోజనం చేస్తారు. అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. నాలుగు గంటలకు మీడియాతో మాట్లాడతారు. ఐదు గంటలకు హెలీకాప్టర్‌లో తిరిగి ప్రయాణమవుతారు.

అవన్నీ డూప్లికేట్ పట్టాలు

మండల సర్వసభ్య సమావేశంలో ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ



మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ

ప్రజాశక్తి - ఆచంట

వైసిపి ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల పట్టాలన్నీ డూప్లికేట్ పట్టాలని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇళ్ల కేటాయించిన స్థలాల్లో ఒక్క లేఅవుట్ కూడా అప్రూవల్ కాలేదని, అప్పటి ఎంఎల్‌ఎ బోగస్ పట్టాలిచ్చి మోసగించారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో నిర్మాణం ప్రారంభించిన కమ్యూనిటీ హాల్ వద్ద నుండి సిమెంటు, ఐరన్, ఇసుక తరలించుకుపోతుంటే పంచాయతీరాజ్ శాఖాధికారులు నిద్రపోతున్నారని ఎంఎల్‌ఎ మండిపడ్డారు. ప్రభుత్వ సొమ్మును తరలించుకుపోతుంటే సంబంధిత వ్యక్తులపై పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ఆ అధికారిని నిలదీశారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఎఇ రమేష్ సమాధానం చెప్పకుండా మౌనం వహించడంతో పితాని స్పందిస్తూ ఎక్కడెక్కడ నుండి భవన నిర్మాణ సామగ్రిని తరలించారో పూర్తిస్థాయిలో నివేదికలు తయారు చేసి ఇవ్వాలని ఆదేశించారు. లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. రంగనాథరాజు చేసిన పనులన్నీ ఎంఎల్‌ఎ బినామీ కాంట్రాక్టర్లు నిర్వహించారని, ఆ డబ్బంతా ఎంఎల్‌ఎ ఖాతాల్లో చేరిందని, ఈ విషయం థర్డ్‌పార్టీ ఎంక్వయిరీలో స్పష్టమైందని పితాని తెలిపారు. అధికారుల సహకారం లేకుండా ఇదంతా జరిగిందా అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో 12 గ్రామాలకు సంబంధించి ఇంటింటికీ తాగునీరందించేందుకు నిధులు మంజూరైనా ఇప్పటివరకు పనులు అంతంతమాత్రంగానే సాగుతున్నాయన్నారు. ఆచంట మండలంలో దాళ్వా ధాన్యం సొమ్ము రూ.56.40 కోట్లు రావాల్సి ఉందని, ఇప్పటి వరకు రూ.6.60 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమైనట్లు మండల ఇన్‌ఛార్జి వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. ఈ విషయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించారని పితాని తెలిపారు. ఆచంటలో వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వైద్యాధికారి శివరంజని తెలిపారు. పేషెంట్లకు జనరల్ మందులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆమె కోరారు. ఇరిగేషన్ అధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ వర్షాభావం, గోదావరిలో నీటిమట్టం తక్కువగా ఉన్న నేపథ్యంలో శివారు ప్రాంతాలకు పూర్తిస్థాయిలో నీరందడం లేదన్నారు. సమావేశంలో జెడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్‌బాబు, వైస్ ఎంపిపిలు ఎర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసిలు, ఎంపిడిఒ పి.నరసింహప్రసాద్, తహశీల్దార్ ఐపి.శెట్టి, ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎంపిపి ఛాంబర్‌లో మాజీ సిఎం జగన్ ఫొటో

ఎంపిపి ఛాంబర్‌లో జగన్ ఫొటో

అధికారుల తీరుపై పలువురు విస్మయం

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల పరిషత్ కార్యాలయం ఎంపిపి ఛాంబర్‌లో ముఖ్యమంత్రి ఫొటో ఉండాల్సిన ప్రాంతంలో నేటికీ మాజీ సిఎం జగన్ ఫొటోనే కనిపిస్తుంది. ఎన్నికల కోడ్ ముగిసినా, నూతన ప్రభుత్వం వచ్చినా మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిపి ఛాంబర్‌లో జగన్ ఫొటో తొలగించలేదు. ఫొటో తొలగించకపోవడాన్ని నరసాపురం మాధవాయిపాలెం-సఖినేటిపల్లి గోదావరి రేవు పంటు నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన జాయింట్ కమిటీ సమావేశానికి వచ్చిన సభ్యులు చూసి విస్తుపోయారు.




నిర్మానుష్యంగా ఉన్న జాతీయ రహదారి

సూరీడు భగభగ.. జనం విలవిల

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని గ్రామాల్లో ఆదివారం ఎండ వేడి అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మే నెలను మించి ఎండ వేడిమి ఉండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడ్డారు. ఉష్ణోగ్రతలు సుమారు 40 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదయ్యాయి. దీంతో సాయంత్రం వరకు గ్రామాల్లో జన సంచారం లేదు. రహదారులు నిర్మానుష్యంగా మారాయి.



రాధాకృష్ణకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సుభాష్

రాధాకృష్ణను కలిసిన మంత్రి సుభాష్

ప్రజాశక్తి - తణుకు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక సంక్షేమ శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆదివారం తణుకు ఉమ్మడి కార్యాలయంలో నియోజకవర్గ ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన సుభాష్‌కి రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. వీరి వెంట మాజీ రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ ఛైర్మన్ దొమ్మేటి వెంకట సుధాకర్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

త్వరలో తాడేపల్లిగూడెంలో క్రికెట్ స్టేడియం

ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్



క్రికెట్ ఆడుతున్న ఎంఎల్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

స్థానిక శశి స్కూలు పక్కనే ఉన్న క్రీడా ప్రాంగణాన్ని అతిత్వరలో సంపూర్ణ క్రికెట్ స్టేడియంగా అభివృద్ధి చేయనున్నట్లు ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. వానపల్లి సుధాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఎంఎల్‌ఎ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో అన్ని క్రీడలకూ సంబంధించిన సదుపాయాలు కల్పించడం ద్వారా శారీరక దారుఢ్యంతోపాటు యువకులకు ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా కృషి చేస్తామన్నారు. త్వరలోనే పట్టణంలో అసంపూర్తిగా మిగిలి ఉన్న ఇండోర్ స్టేడియంతోపాటు స్విమ్మింగ్ పూల్‌ను కూడా త్వరత్వరగా పూర్తి చేయడానికి కృషి చేస్తానన్నారు. తొలుత రిబ్బన్ కత్తిరించి టోర్నమెంట్ ప్రారంభించారు. అనంతరం ఎంఎల్‌ఎ క్రికెట్ అడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో పైబోయిన రఘు, వర్తనపల్లి కాశీ, నరిసే సోమేశ్వరరావు, పుల్లా బాబి, కేశవబట్ల విజయ్, కుమార్, ముఖేష్, పైబోయిన వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్‌ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి

ఎంఎల్‌ఎ నాయకర్‌కు అధ్యాపకుల వినతి



నాయకర్‌తో ఎయిడెట్ అధ్యాపకులు

ప్రజాశక్తి - నరసాపురం

ఎయిడెడ్ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్నటువంటి అన్ ఎయిడెడ్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని వారు ఆదివారం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు ఎంఎల్‌ఎ దృష్టికి తమ సమస్యలను తీసుకు వచ్చారు. గత ప్రభుత్వం బ్రిటిష్ హయాంలో ఏర్పడినటువంటి, ప్రస్తుత కాలంలో కూడా కొనసాగుతున్న ఎయిడెడ్ కళాశాలలను నిర్వీర్యం చేసిందన్నారు. అందులో పని చేస్తున్న అన్ ఎయిడెడ్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది జీవితాలను, పేద విద్యార్థులను చదువులకు దూరం చేసి, జిఒ నెంబర్ 42 తీసుకుని వచ్చి ఎయిడెడ్ విద్యావ్యవస్థలను కూకటి వేళ్లతో సహా పెకిలించి సర్వనాశనం చేసిందన్నారు. 2018లో తమ ప్రభుత్వంలో అన్ ఎయిడెడ్ డిగ్రీ అధ్యాపకులకు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయడం కూడా జరిగిందని తెలిపారు. ఈ ప్రభుత్వంలో తమ ఆధ్వర్యంలో ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఎయిడెడ్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపక, అధ్యాపకేతర, బడుగు బలహీన పేద విద్యార్థులకు, కళాశాలలకు త్వరగా న్యాయం చేసి తమ కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడెడ్ అధ్యాపకులు, యూనియన్ నాయకులు పి.ఝాన్సీ లక్ష్మి, జి.సాగర్, టి.మనోహరి చారి, బాల రాజు, యాకోబు పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

ఆర్‌టిసి డిపో జెఎసి నాయకుల నిరసన




నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్‌టిసి జెసి నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం ఆర్‌టిసి డిపోలో యాజమాన్యం సర్వీస్‌రూట్‌కు కిలోమీటర్లు పెంచి కార్మికులపై పని భారం పెంచుతున్నందుకు శనివారం నుంచి డిపో వద్ద నిరసన కార్యక్రమం జరుగుపుతున్నట్లు డిపో జెఎసి నాయకులు డివిఎస్.కుమార్, ఎస్.రమేష్ బాబు తెలిపారు. భీమవరం నుంచి వాడపల్లి వెళ్లే సర్వీస్‌కు కిలోమీటర్లు పెంచిన కారణంగా కార్మికులపై పని భారం పెరుగుతున్నందున, కార్మికుల ఆందోళన దృష్ట్యా ఈ విషయం యాజమాన్యంకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోని కారణంగా కార్మికులు నిరసన తెలియజేస్తున్నట్లు జెఎసి నాయకులు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చాలా దారుణంగా కిలో మీటర్లు పెంచడం అన్యాయమని వారన్నారు. ఫస్ట్ ఎయిడ్ కిట్లు చిన్న ప్లాస్టిక్ కవర్‌లో చేసి ఇస్తున్న కారణంగా మార్గమధ్యలో అవి పోయే అవకాశం ఉన్నందున వాటిని పూర్వం లాగే బస్సులకు బిగించాలని వారు కోరారు. ఒకవేళ ఈ కిట్టు పోయిన యెడల కార్మికులకు ఎటువంటి బాధ్యత లేదని వారు తెలిపారు. వెహికల్ కండిషన్ పూర్తిగా పాడైపోయి, బస్సులు మార్గమధ్యంలో ఆగిపోతున్నందున ప్రయా ణికులు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వెంటనే వెహికల్ కండిషన్ మెరుగుపరచాలని వారు కోరారు. కార్మికులకు, ఉద్యోగులకు సైకిల్ స్టాండ్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ఇంక్రిమెంట్లు వెంటనే కల్పించాలని వారు కోరారు. కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్నారని జెఎసి నాయకులు చెప్పారు. యాజమాన్యం కార్మికుల ఆందోళన పరిశీలించి సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని వారు కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో డి.రామ్ కుమార్, జివి.రావు, డిఎ.రావు, సిపిఐ జిల్లా నాయకులు ఎం.సీతారాం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆహా.. ఏమి రుచి..!

152 రకాల వంటకాలతో కేరళవాసికి భీమవరం విందు




విస్తర్లలో వంటకాలు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

'ఆహా.. ఏమి రుచి.. తినరా మైమరిచి.. రోజు తిన్నా మరి.. భీమవరం విందే వేరు మరి' అంటున్నారు కేరళవాసి రికేష్‌శర్మ. కేరళకు చెందిన రికేష్ శర్మ భీమవరంలో జరిగిన జెసిఐ ఇంటర్నేషనల్ సమావేశానికి విచ్చేశారు. ఇంకేముంది భీమవరం అంటేనే మర్యాదలకు, ఆతిథ్యాలకు పుట్టినిల్లు. సుమారు 152 రకాల భీమవరం వంటకాల రుచులను రికేష్‌శర్మకు చూపించారు పట్టణానికి పట్టణానికి చెందిన పేరిచర్ల కృష్ణంరాజు. స్వీట్స్, హాట్స్, వెజ్ అండ్ నాన్ వెజ్ బిర్యానీలు, ఫ్రూట్స్, వెజ్ అండ్ నాన్ వెజ్ పచ్చళ్లు మరెన్నో వంటకాలతో భీమవరం రుచులు చూపించారు. వంటకాలు చూసిన రికేష్‌శర్మ ఒక్కసారిగా సంభ్రమాశ్చర్యాలకు గురయ్యారు. ఇన్ని రకాల వంటకాలను ఒకేచోట చూడటం ఇదే మొదటిసారి అని అబ్బురపడ్డారు. ఆయన వెంట నడింపల్లి మహేష్‌కుమార్ వర్మ తదితరులు ఉన్నారు.

సంగీత కళాకారుడు ప్రసాద్ అభినందనీయులు



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సంగీతంలో డిప్లమో పొంది ఆధ్యాత్మిక సంగీతంతో దేశ విదేశాల్లో కచేరిలు చేసి అవార్డులు, సన్మానాలు పొందిన ప్రసాద్ అభినందనీయులని ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. వివిధ దేశాల్లో 22 కచేరీలు చేసి అవార్డులు పొందిన భీమవరం సంగీత కళాకారులు పిప్పళ్ల ప్రసాద్‌ను శ్రీ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఎంఎల్‌ఎ అంజిబాబు కార్యాలయంలో అభినందన సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎంఎల్‌ఎ అంజిబాబు మాట్లాడుతూ తన ఇంట్లోనూ, విశాఖపట్నంలో తన వియ్యంకుని నివాసంలోనూ ప్రసాద్ సంగీత కచేరి చేశారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ భూటాన్‌లో ప్రసాద్ మే 31 నుంచి జూన్ 10 వరకు పలుచోట్ల సంగీత కచేరీలు నిర్వహించారన్నారు. సన్మాన గ్రహీత పిప్పళ్ల ప్రసాద్ మాట్లాడుతూ భారతదేశంతోపాటు 16 దేశాల్లో సంగీత కచేరీలు నిర్వహించానని, సంగీతానికి ఆయా ప్రాంతాల్లో ఆదరణ ఉందని, భూటాన్ దేశంలో 8 రోజులపాటు కచేరి నిర్వహించామని అన్నారు. అనంతరం ప్రసాద్‌ను ఎంఎల్‌ఎ సత్కరించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, చెల్లబోయిన గోవింద్, విజ్జురోతి రాఘవులు, మైలాబత్తుల ఐజాక్ బాబు, కొండ్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం నివారించాలని ర్యాలీ



ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీవిజ్ఞాన వేదిక నాయకులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్లాస్టిక్ మహమ్మారి ప్రపంచాన్ని గడగడలాడిస్తుందని, అవగాహనా రాహిత్యంతో విద్యావంతులు కూడా ప్లాస్టిక్ వస్తువులనే వాడటం దారుణమని భీమవరం రైతు బజార్ ఆఫీసర్ కళ్యాణ్ కుమార్ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, పర్యావరణ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం రైతు బజార్‌లో రైతులు, వినియోగదారులతో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ, పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. నాలుగేళ్లుగా రైతు బజార్ ఆఫీసర్‌గా మన భీమవరం రైతు బజార్‌లో స్వచ్ఛంద సంస్థల సహకారంతో పలుమార్లు ఈ విషయాలపై కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, 50 శాతం వినియోగదారుల్లో చైతన్యం కలిగి గుడ్డ సంచులను వాడుతున్నారని అన్నారు. పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ మాట్లపూడి సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడటంతో అంతుపట్టని వ్యాధులు సంభవిస్తున్నాయని, ప్లాస్టిక్ వాడకం నిషేధించడానికి ప్రభుత్వం కొన్ని చట్టాలను చేసిందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధ ప్రతిజ్ఞ నిర్వహించి నెలలో రెండు, మూడు సార్లు ఈ విషయంపై తనిఖీలు చేపట్టాలని, వ్యతిరేకించిన వారిపై పర్యావరణ చట్టం కింద చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగన్న, బొల్ల రాముడు, శ్రీరామూర్తి, మోటుపల్లి సత్యనారాయణ, వేలూరి విద్య సాగర్, ఎస్‌కె.చాన్ భాషా పాల్గొన్నారు.

చించినాడలో టూరిజానికి ప్రాధాన్యత

కాస్మో ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు

ప్రజాశక్తి - పాలకొల్లు

సిఎం చంద్రబాబు టూరిజంకు అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో కాస్మో కల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆధ్వర్యంలో చించినాడ గోదావరి ఒడ్డున ఉన్న 4 ఎకరాల స్థలాన్ని టూరిజం కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నట్లు సంస్థ ఛైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు అన్నారు. ఆదివారం కాస్మో కాంప్లెక్స్‌లో గాంధీ భగవాన్ రాజు అధ్యక్షతన నూతన కార్యవర్గం సమావేశం నిర్వహించారు. గతంలో వలె క్రీడా పోటీలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశం నిర్ణయించినట్లు చెప్పారు. పాలకొల్లు నుంచి ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఎందరో స్పోర్ట్స్ ఇంజనీరింగ్ సెటిల్ అయ్యారని వారు పాలకొల్లు వచ్చినప్పుడు టూరిజం కేంద్రంలో ఉండేలా అన్ని సౌకర్యాలు కలుగజేస్తున్నట్లు తెలిపారు. తమ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ద్వారా ఎందరో రాష్ట్ర, జాతీయ క్రీడాకారులను తయారుచేశారని, తిరిగి అటువంటి ఘనత సాధించాలని నిర్ణయించినట్లు అన్నారు. ఉపాధ్యక్షులు రుద్రరాజు సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి వేగేశ్న సోమరాజు, సహాయ కార్యదర్శి దండు గోపాల్ రాజు, కోశాధికారి రుద్రరాజు రమేష్ బాబు పాల్గొన్నారు.



సమావేశమైన కాస్మో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నూతన కార్యవర్గం

అజాద్‌కు బాల సాహితీ పురస్కార్ పట్ల హర్షం

పెనుమంట్ర: ప్రతిష్టాత్మక సాహిత్య అకాడమీ బాల సాహితీ పురస్కార్ ప్రముఖ సాహితీ వేత్త పమిడిముక్కల చంద్రశేఖర అజాద్‌కు లభించడం పట్ల పలువురు సాహితీ పరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అజాద్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులోని స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ స్థానిక రసన సాహితీ సంస్థ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సాహిత్యం మీద అభిరుచితో ఉద్యోగానికి రాజీనామా చేసి సినిమాలవైపు వెళ్లి, చాలాకాలం పరుచూరి బ్రదర్స్ వద్ద సహాయకునిగా పనిచేశారు. డి.రామానాయుడు నిర్మించిన సూపర్ హీరోస్ సినిమాకు సోలో రచయితగా ఆయన పనిచేశారు. వివిధ టీవి ఛానల్స్‌లో అజాద్ వెయ్యికి పైగా సీరియల్స్ ఎపిసోడ్స్‌కు కథలు రాశారు. కొన్ని పాత్రలలో నటించారు. అజాద్‌కు సాహిత్య అకాడమీ బాల పురస్కార్ లభించడం పట్ల ప్రముఖ సినీకవి రసరాజు, డాక్టర్ ఆర్.రామ్మోహనరావు, రచయితలు ఎన్‌కె.నాగేశ్వరరావు, ఎంఆర్‌వి.సత్యనారాయణ మూర్తి, సిహెచ్.రాజేంద్ర ప్రసాద్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.


చంద్రబాబుకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రామరాజు

చంద్రబాబును కలిసిన రామరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన నారా చంద్రబాబునాయుడును నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లోను అభివృద్ధి సాధించి దేశంలోనే అగ్రగామిగా నిలుస్తుందని రామరాజు తెలిపారు.

డ్రెయిన్ల పూడిక తీత

ప్రజాశక్తి - ఉండి

మండలంలోని పెద పుల్లేరు గ్రామంలో ఆదివారం డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, చాలా కాలంగా డ్రెయినేజీలో సిల్ట్ తీయక పూర్తిగా నిండిపోయాయి దుర్గంధం వెదజల్లుతున్నాయన్నారు. గ్రామంలో పారిశుద్ధ్య నివారణలో భాగంగా డ్రెయినేజీలో చెత్తా చెదారం వేయకుండా పంచాయతీకి గ్రామస్తులు సహకారం అందించాలని కోరారు. డ్రెయినేజీలో తీసిన సిల్ట్‌ను వేరే ప్రాంతానికి తరలించారు.


పనులను పరిశీలిస్తున్న సర్పంచి


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

అందరూ మానవత్వంతో ముందుకు సాగాలి

మానవత సంస్థ జిల్లా నియంత్రణ ఛైర్మన్ రాంబాబు

ప్రజాశక్తి - పెనుమంట్ర

ప్రతీ వ్యక్తి మానవత్వం కలిగి ముందుకు సాగినప్పుడే సమాజం బాగుంటుందని మానవత స్వచ్ఛంద సంస్థ జిల్లా నియంత్రణ ఛైర్మన్ గమిని రాంబాబు అన్నారు. ఆదివారం సాయంత్రం మార్టేరు శ్రీవేణుగోపాల ఆడిటోరియంలో మండల శాఖ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నూతన కార్యవర్గ ప్రతినిధులు ప్రెసిడెంట్‌గా కర్రి కృష్ణా రెడ్డి, సెక్రెటరీగా శ్రీనివాసులు మురళీకృష్ణ, ట్రెజరర్‌గా చదువుల వెంకట నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్‌గా బండి ప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా దొంగ జయ దుర్గారావు, ఇసి హెల్త్ ప్రతినిధిగా పడాల రామచంద్రారెడ్డి, ఇసి ఎడ్యుకేషన్‌గా బండారు ఇంద్రేశ్వర స్వామి గుప్తా, ఇసి ఎమర్జెన్సీగా చర్ల శశిధర్ వంశీ హరినాథ్ రెడ్డి, ఇసి అవేర్నెస్‌గా అమృతవాకల సత్యనారాయణలు ప్రమాణ స్వీకారం చేశారు. సభకు బాణాల శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, మానవత జిల్లా, మండల ప్రతినిధులు డాక్టర్ కలిదిండి రామచంద్రరాజు, కొత్త సత్యనారాయణ మూర్తి, కోడూరి రాధా పుష్పవతి, పెనుమంట్ర జెడ్‌పిటిసి కర్రి గౌరీ సుభాషిణి పాల్గొని ప్రసంగించారు.

'నేడు ఎంఎల్ఎ పితాని అందుబాటులో ఉండరు'

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట ఎంఎల్ఎ, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ ఈనెల 17వ తేదీ సోమవారం అందుబాటులో ఉండరని కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టిడిపి, జనసేన, బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు ఈ విషయం తెలియజేస్తున్నామని పేర్కొన్నారు.


వెండి శంఖాన్ని అందిస్తున్న శ్రీహర్ష

మావుళ్లమ్మకు వెండి శంఖం బహూకరణ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీమావుళ్లమ్మ అమ్మవారికి భీమవరంకి చెందిన మద్దిరాల ఈశ్వర శ్రీహర్ష అమ్మవారి అభిషేకంకు 400 గ్రాముల వెండి శంఖం ఆదివారం ఆలయ అధికారులకు అందజేశారు. వీరికి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందజేశారు.

యాత్రికులతో ముత్యాలమ్మ ఆలయం రద్దీ

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో వేంచేసియున్న బండి ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఆదివారం యాత్రికులతో కళకళలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో బండి ముత్యాలమ్మ భజన సంఘం ఆధ్వర్యంలో ఆలపించిన గీతాలు ప్రజలను ఆకట్టుకున్నాయి. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కార్యనిర్వాహణాధికారి, దెందుకూరి రామకృష్ణంరాజు, ఆలయ ఛైర్మన్ కడలి మాణిక్యాలరావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ, తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఉండి

ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఉండి మండలం వెలివర్రు గ్రామంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వెలివర్రు గ్రామానికి చెందిన గండికోట రామస్వామి(25) తన భార్యతో కలిసి కేరళలో నివసిస్తున్నారు. ఈనెల 14వ తేదీన తన స్వగ్రామమైన వెలివర్రు వచ్చాడన్నారు. తన భార్య ఆదివారం ఉదయం చర్చికి వెళ్లి ఇంటికి వచ్చేసరికి రామస్వామి తన తమ్ముడు ఇంట్లో ఉరివేసుకొని కనిపించడంతో స్థానికుల సహాయంతో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. అప్పటికే రామస్వామి మృతి చెందడంతో రామస్వామి సోదరుడు గండికోట దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉండి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తీరంలో తాగునీటి కష్టాలు

సమస్య పరిష్కరించాలని ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నారు. తాగునీటికోసం కుళాయిల వద్ద గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. అత్యధికంగా ఈ సమస్య సముద్రతీర ప్రాంతాల్లో ఉంది. దీంతోపాటు గ్రామాల చుట్టూ ఉప్పుటేరులు ఉన్నాయి. వాటిల్లోకి సముద్రపోటు ప్రభావంతో ఉప్పునీరు చుట్టూ ప్రవహిస్తుంది. భూగర్భజలాల్లో కూడా ఉప్పు శాతం పెరిగింది. ఆ నీటిని కనీసం పశువులు, ఇతర అవసరాలకు వినియోగించేందుకు అవకాశం లేదు.

తాగునీటి పథకాలు ఉన్నా..

మొగల్తూరు మండలం కోమటితిప్ప, కేపీపాలెంలో సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు ఉన్నాయి. వాటి నిర్వహణకు ఏటా సుమారు రూ.1.20 కోట్లు వెచ్చిస్తున్నారు. వాటి ద్వారా ప్రజలకు శుద్ధిజలాలు అందిస్తున్నారు. నిర్వహణ లోపంతో ఆయా తాగునీటి పథకాలకు శివారున ఉన్న గ్రామాల్లోని ప్రజలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు.

సమస్య తీవ్రం..

తాగునీటి పథకాల ద్వారా సరఫరా చేస్తున్న కుళాయిలకు పలువురు విద్యుత్ మోటార్లను ఏర్పాటుచేసి శుద్ధిజలాలను భారీగా సొంత అవసరాలకు మళ్లిస్తూ దుర్వినియోగానికి పాల్పడుతున్నారు. దీంతో శివారు


చింతరేవులో గుంతల్లో పైపునీటిని పట్టుకుంటున్న మహిళలు

ప్రాంతాల్లోని పైపులకు నీటి సరఫరా జరగడం లేదు. దీంతో ప్రజలు ఆయా కుళాయిల సమీపంలో పైపులైను వద్ద పెద్ద పెద్ద గుంతలు తవ్వుకుని నీటిని పట్టుకుంటున్నారు. అది కూడా సక్రమంగా రావడం లేదు. కేపీపాలెం తాగునీటి పథకానికి శివారున ఉన్న వారతిప్ప, ముత్యాలపల్లి, కొత్తకాయలతిప్ప తదితర గ్రామాలకు నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదు. మొగల్తూరు తాగునీటి పథకం శివారున ఉన్న కొత్తపాలెం, శేరేపాలెం గ్రామాలదీ అదే పరిస్థితి.

ముత్యాలపల్లిలో..

ముత్యాలపల్లిలో సుమారు ఐదువేలమంది పైబడి ప్రజలు నివశిస్తున్నారు. ఈ గ్రామంలో చింతరేవు ప్రాంతంలో తాగునీరు సక్రమంగా సరఫరా జరగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపుల వద్ద గుంతలు తీసుకుని తాగునీటిని పట్టుకుంటున్నారు.

తాగునీటికి తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నాం

పెదసింగు గంట్లమ్మ, ముత్యాలపల్లి



మా గ్రామంలో కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్న నీరు సక్రమంగా రావడం లేదు. కుళాయిల వద్ద గుంతలు తవ్వుకుని నీటిని పట్టుకుంటున్నాం. అదికూడా పూర్తిస్థాయిలో రావడంలేదు. మా సమస్యను అధికారులకు చెప్పినా పట్టించు కోవటం లేదు. ఇప్పటికైనా అధికారులు మా సమస్యను పరిష్కరించాలి.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి

స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ


విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేస్తున్న ఎంఎల్ఎ పితాని

ప్రజాశక్తి - ఆచంట

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ఆ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆచంట నియోజకవర్గం ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆచంట ఎంపిడిఒ కార్యాలయం ఆవరణలో నియోజకవర్గస్థాయిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ బ్యాగులు, కిట్లు పంపిణీ కార్యక్రమం ఎంఇఒ ఉషారాణి అధ్యక్షతన నిర్వహించారు. ఎంఎల్ఎగా గెలుపొందిన పితాని సత్యనారాయణ మొట్టమొదటిసారిగా ఆచంట టిడిపి కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున బాణాసంచాతో, వాయిద్యాలతో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనకు ఘన స్వాగతం పలికి, ఘనంగా సన్మానించి సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి ఎన్‌టిఆర్ విగ్రహం వరకు పాదయాత్రగా చేరుకుని ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు పుష్పాలతో ఎంఎల్ఎకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పితాని పాల్గొని మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ద్వారా ఉన్నతమైన విద్యను అందించడమే ఈ ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసిన తరువాత నియోజకవర్గంలో మొట్టమొదటిసారిగా విద్యార్థులకు పుస్తకాలు, విద్యా సామాగ్రిని అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. పార్టీలకతీతంగా ఈ కార్యక్రమం ఒక పండుగ వాతావరణంలో జరగడం అభినందనీయమని కొనియాడారు. మాది ప్రజా ప్రభుత్వమే తప్ప దుర్మార్గపు ప్రభుత్వం కాదని ఎద్దేవా చేశారు. దుర్మార్గపు ప్రభుత్వాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు కాబట్టి ఆ ప్రభుత్వానికి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారని అన్నారు. ప్రతిపక్షాన్ని గౌరవించే విధంగా నడుచుకుంటామన్నారు. గత ప్రభుత్వంలో ఆత్మస్థైర్యాన్ని ప్రజాప్రతినిధులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఉన్నత విద్యను అందించడానికి ఉపాధ్యాయుల ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కూటమి అధికారంలోకి రావడానికి ఉపాధ్యాయులు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. సోమ, మంగళవారాల్లో నియోజవర్గంలో ఉన్న అన్ని పాఠశాలకు ప్రభుత్వ పాఠ్యపుస్తకాలు, విద్యాసామాగ్రిని ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులతో పార్టీలకతీతంగా అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, జడ్‌పిటిసి ఉప్పలపాటి సురేష్ బాబు, వైస్ ఎంపిపి ఎర్రగుప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపిడిఒ పి.నరసింహ ప్రసాద్, తహశీల్దార్ ఐపిశెట్టి, ఎంఇఒలు ఉషారాణి, రాజేంద్రప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తి బాబు, వివిధ శాఖల అధికారులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న బొలిశెట్టి

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, దీనిని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాల్లో భాగంగా కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో అధ్యక్షులు వంగపండు రామోహనరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ ప్రారంభించారు. నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. జిల్లా డిప్యూటీ గవర్నర్ లయన్స్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారంతో 132 మందికి కంటి పరీక్షలు చేసి, ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 14 మందిని నిడదవోలు హాస్పటల్‌కు పంపించారు. 23 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. అనంతరం ఎంఎల్ఎ చేతుల మీదుగా పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సభ్యులందరూ ఆలోచించి తాడేపల్లిగూడెం పట్టణంలో మంచి పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు. లయన్స్ క్లబ్ తరపున ఎలాంటి సేవా కార్యక్రమాలు అయినా చేయడానికి ముందు ఉంటానని ఆయన అన్నారు. లయన్స్ క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రీజియన్ ఛైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్, బాపయ్య శర్మ, జనసేన, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకట నరసింహులు మృతి తీరని లోటు

సిపిఎం నాయకులు సుబ్బరాజు

ప్రజాశక్తి - పెనుమంట్ర



వెంకట నరసింహులు మృతి వారి కుటుంబానికి, పార్టీకి తీరని లోటని సిపిఎం మండల కార్యదర్శి కె.సుబ్బరాజు అన్నారు. మండలంలోని బ్రాహ్మణ చెరువుకు చెందిన సిపిఎం సీనియర్ సభ్యులు మల్లుల వెంకట నరసింహులు ఆకస్మిక మృతికి పలువురు సిపిఎం నేతలు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకట నరసింహులు ఆదివారం తుది శ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు అమ్మాయిలు, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. ఆయన బ్రాహ్మణచెరువులోని సివిల్ సప్లై గోడౌన్‌లో సుదీర్ఘకాలం మేస్త్రీగా పనిచేశారు. పనిచేసిన కాలంలో గోడౌన్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ముందుండి చురుకుగా పనిచేశారు. ముందుగా వెంకట నరసింహులు భౌతికకాయంపై పార్టీ నాయకులు ఎర్రజెండా కప్పి, దండేసి నివాళులర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు కేతా గోపాలన్, ఆకుల హరేరామ్, నేతల చిత్తరంజన్, బత్తుల విజయ్ కుమార్, తెన్నేటి ఆంజనేయులు, నక్కా కాంతారావు, సివిల్ సప్లై కార్మిక నాయకులు పరమేశు శ్రీరామచంద్రమూర్తి, నాగరాజు, బి.తాతయ్య, జె.ఏసుదాసు, రైస్ మిల్ ఇళ్ల వెంకటేశులు, పలువురు కార్మికులు పాల్గొని నివాళులు అర్పించారు.

పంచాయతీ కార్మికులపై వేధింపులు అరికట్టాలి

సిఐటియు నాయకుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ప్రభుత్వాలు మారినప్పుడల్లా పంచాయతీ కార్మికులపై వేధింపులు పెరుగుతున్నాయని, కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వేధింపులను అరికట్టి పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు అనుబంధం పశ్చిమగోదావరి జిల్లా కమిటీ విజ్ఞప్తి చేసింది. ఆదివారం స్థానిక సిఐటియు జిల్లా ఆఫీసులో జరిగిన సమావేశానికి యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రాజారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి, రాష్ట్ర కమిటీ నాయకులు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామపంచాయతీలలో ట్యాంకు వాచర్లు, ఎలక్ట్రీషన్లు, అటెండర్లు, స్వీపర్లు, గ్రీన్ అంబాసిడర్‌లు వంటి పనులు నిర్వహిస్తున్న కార్మికులు పర్మినెంట్ కాక కనీస వేతనాలు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. వీటికి తోడు ప్రభుత్వాలు మారినప్పుడల్లా గ్రామీణ ప్రాంతాల్లో వీరి మీద రాజకీయ వేధింపులు తీవ్రమవుతున్నాయని తెలిపారు. ఎన్నికల్లో, పండుగల్లో, తీర్థాలలో జిల్లా అధికారులు, మంత్రులు, ఎంఎల్ఎలు, గ్రామీణ ప్రాంతాలకు వచ్చిన సందర్భాల్లో అన్ని రకాల పనులు సమయం, సందర్భం లేకుండా శ్రమిస్తున్నారని తెలిపారు. కానీ వారి సమస్యలు పట్టించుకున్న నాథుడు మాత్రం కనపడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంఘం గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలోనైనా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. జిల్లాలో ఉన్న మంత్రులతో పాటు అధికారులను కలిసి వినతి పత్రాలు అందజేస్తామని ఆయన తెలిపారు. పంచాయతీ శాఖ మంత్రిని కలిసి జిల్లాలో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళతామని అన్నారు. ఈ కార్యక్రమంలో శివరాం, రాజబాబు పాల్గొన్నారు.

మొగల్తూరులో మే పుష్పం కనువిందు

ప్రజాశక్తి - మొగల్తూరు


పుష్పాన్ని వీక్షిస్తున్న చిన్నారి

మొగల్తూరు పంచాయతీ పరిధి కడలి వారి పాలెంలో టిడిపి నాయకులు పాల రాంబాబు ఇంటి ఆవరణలో ఆదివారం మే పుష్పం వికసించింది. సాధారణంగా మే నెలలో పుష్పం వికసిస్తుంది. కాని ఈ పుష్పం ఈ నెలలో వికసించింది. దీనిని చూసేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు.


విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న ఎంఎల్ఎ నాయకర్

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - నరసాపురం

చిన్నమామిడిపల్లిలోని శ్రీనాగారమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. సరిపల్లిలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రధా నోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నరసాపురం మాజీ ఎంఎల్ఎ బండారు మాధవ నాయుడు, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ కలిసి పాల్గొన్నారు. ఈ టోర్నీలో పట్టణంలో శ్రీహరిపేటకు చెందిన టీం విన్నర్‌గా నిలిచింది. సరిపల్లి టీం రన్నర్‌గా నిలిచింది. విజేతలకు ప్రథమ బహుమతి రూ.20 వేలు, షీల్డ్స్, ద్వితీయ బహుమతి రూ.10 వేలు షీల్డ్స్ ఇరువురు నాయకులు కలిసి బహుమతులు ప్రధానం చేశారు.

ఉచిత వైద్య శిబిరంలో 69 మందికి పరీక్షలు

ప్రజాశక్తి - పెనుగొండ

వైద్య శిబిరంలో 69 మందికి వైద్య పరీక్షలు అందించినట్లు మానవత అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ తెలిపారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ, ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం రెడ్డి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వైద్య శిబిరంలో పరిసర ప్రాంతాల ప్రజలు 47 మంది షుగర్, బిపి, కీళ్లనొప్పులు, గుండె సమస్యలకు చికిత్స చేయించుకున్నారని, 22 మంది దంత వైద్య శిబిరానికి మొత్తం 69 వైద్య సేవలు పొందారన్నారు. మంది హాజరైనట్లు తెలియజేశారు. ఈ శిబిరంలో అమత హాస్పటల్ మరియు రత్నాస్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ హాస్పిటల్ ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవా సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరంలో అమత ఆస్పటల్ డాక్టర్ వల్లభనేని కిషోర్ డాక్టర్ పి. భార్గవ్ సాయిరాం వైద్య సేవలు అందించారు. అంతేకాకుండా డాక్టర్ మేడపాటి మురళి జోగి రెడ్డి దంత సమస్యలకు సేవలందించారు. ఈ శిబిరంలో మానవతా ఉపాధ్యక్షులు నల్లమిల్లి విజయరాజ బచ్చు లక్ష్మి నరసింహ మూర్తి, రీజినల్ కర్రీ నరేందర్ రెడ్డి, కాకర శశి కుమార్, మురళీకష్ణ , రమేష్, షేక్ మస్తాన్, అత్యం నవీన్, టీ దివాకర్, వసంత కుమార్, శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకర్‌ను కలిసిన లూథరన్ చర్చి సభ్యులు

నరసాపురం: నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ని స్థానిక క్రీస్తు లూథరన్ దేవాలయ ఎ క్లాస్ పెరిష్ సభ్యులు ఆదివారం ఎంఎల్ఎ కార్యాలయంలో కలసి అభినందనలు తెలియజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నాయకర్ మాట్లాడుతూ అందరి ప్రార్థనలు, దీవెనలు, ఆశీర్వాదాలు నా గెలుపుకు కారణమని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చర్చి పాస్టర్ రేవరెండ్ చొప్పల ప్రకాష్ అంబెడ్కర్, ఛైర్మెన్ బొంద శాంసన్ రాజు, కోశాధికారి రావి కృపరావు పాల్గొన్నారు.

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నర్సాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No.1/2023

కంచుమర్తి సురేష్, S/o.నాగేశ్వరరావు, శివదేవుని చిక్కాల, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా. ...పిటిషనరు

Vs

1.బొంద మోహన్‌రావు, S/o.అలంకారం, డోర్‌నెం.5-124, పెదపేట, లంకలకోడేరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
2.పొన్న మేఘమాల, W/o.యువ నాగేంద్ర, పల్లపు వీధి, దగ్గులూరు, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
3.ఇనుకోటి స్నేహలత, W/o.చెల్లమలశెట్టి ప్రదీప్, డోర్‌నెం. 4-43-13, సుబ్బారావుపేట, తాడేపల్లిగూడెం, పశ్చిమ గోదావరి జిల్లా.
4.సంపతి దుర్గారావు, S/o.పెదవీరయ్య శంభునిపేట, పాలకొల్లు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.
5.అఫిషియల్ రిసీవర్, ఏలూరు. ...రెస్పాండెంట్స్

పై నెంబర్ I.Pలో పిటిషనరు 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని, అతను 2-4 రెస్పాండెంట్స్ పేరున వ్రాసిన క్రియ దస్తావేజులను (డాక్యుమెంట్ నెంబర్ 2942/2022, 3248/2022 & 3851/2022) రద్దు చెయ్యమని కోరుచు ఇంసాల్వెన్సీ పిటిషన్‌ను దాఖలు చేసి ఉన్నందున సదరు విషయము పురప్రముఖులకు తెలియచేయడం అయినది. 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయుటకు ఎవరికైనా అభ్యంతరాలు ఉన్న ఎడల పిటిషన్ వాయిదా **రోజున అనగా ది.20-06-2024వ తేదీన ఉదయం 10.30** ని॥లకు మీరు స్వయంగా కానీ ప్లీడర్ ద్వారా కానీ పై కోర్టుకు హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షములో పిటిషన్ తీర్మానము చేయబడును అని ఇందు మూలముగా తెలియచేయడము అయినది.

కోర్టు ఆర్డర్ ప్రకారం

నర్సాపురం **జి.వి.సుబ్బారావు,** అడ్వకేటు, పాలకొల్లు.
తేది.16.6.2024 సెల్: 9849418841

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, నరసాపురం

O.S.No.170/2018

Between:
పొత్తూరి వెంకట సత్యనారాయణరాజు వగైరాలు ...వాదులు
మరియు
పొత్తూరి అప్పలరాజు వగైరాలు ...ప్రతివాదులు

సాధారణ పద్ధతిలో ఈ క్రింది వారైన మీకు సమన్లు అమలు కానందున శ్రీయుత కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రికా ప్రకటన ద్వారా 6,7,8 ప్రతివాదులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో సమన్లు జారీ

1.ప్రతివాది - 6 : దాట్ల వెంకట సత్య శ్రీహరి, W/o.వి.వి.యస్.భూపతి వర్మ, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.
2.ప్రతివాది - 7 : పొత్తూరి సాయి వెంకట సూర్యశ్రీదేవి, W/o.సత్యనారాయణ, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.
3.ప్రతివాది - 8 : ఇందుకూరి కనక సత్యనాగలక్ష్మి, W/o.వెంకటరాజు, కలగంపూడి, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా.

పై దావాలో డిక్లరేషన్ పరిహారం నిమిత్తం మీపై మరియు మరి కొంత మందిపై దావా వేసి యుండుట వలన మీరు గాని, మీ ప్లీడరు ద్వారా గాని, **21వ తేదీ జూన్ నెల, 2024 ఉదయం 10.30 గం॥లకు** పైకోర్టు యందు హాజరు కాగలరు లేనిచో మీ పరోక్షమందు సదరు వ్యాజ్యమును తీర్మాణం చేయబడును.

కె.అమరేశ్వరరావు
అడ్వకేట్. సెల్ : 9063777879

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 60/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
వేముల సుజాత అండ్ అనదర్ **-ప్రతివాది/ ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: వేముల సుజాత, W/o. కృష్ణ, 4వ బ్లాక్, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా - 534268.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 152/2019

బిట్వీన్:
విజయా బ్యాంకు, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచి, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, నరసాపురం **-వాది**
అండ్
మర్నీడి కవిత అండ్ అనదర్ **-ప్రతివాది/ ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: మర్నీడి కవిత, W/o. శివరామకృష్ణ, డో.నెం. 2-47, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.
D-2: మర్నీడి శివరామకృష్ణ, S/o. శ్రీనివాసరావు, డో.నెం. 2-47, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

మీరు వాది విజయా బ్యాంక్, ప్రస్తుతం బ్యాంక్ ఆఫ్ బరోడా, నరసాపురం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

O.S. No. 45/2020

బిట్వీన్:
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం **-వాది**
అండ్
వేముల సత్యవతి అండ్ అనదర్ **-ప్రతివాది/ ప్రతివాదులు**

సమన్స్ టు:
D-1: వేముల సత్యవతి, W/o. ప్రసాదు, డో.నెం. 5-114, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, H/o. కొంతేరు, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.
D-2: పజ్జూరి వీరమణి, W/o. శ్రీనివాసరావు, 4వ బ్లాకు, గగ్గిపర్రు, అడవిపాలెం, యలమంచిలి మండలం - 534268, ప॥గో॥జిల్లా.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీ కోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా, **ది. 24-06-2024 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసు కొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
తేది:16-06-24 ఫోన్: 08814-274628